ఈవీఎంల తనిఖీ తర్వాత మాక్ పోల్

రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

● అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : ఈవీఎం యంత్రాల మొదటి దశ తనిఖీ పూర్తికాగానే మాక్ పోల్ నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ భాస్కరరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పార్లమెంట్ సాధారణ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలకు ఉపయోగించే వస్తువులు, వాహనాలకు సంబంధించిన ధరలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లలో భాగంగా సెక్టార్ అధికారుల శిక్షణ కార్యక్రమం పూర్తయినట్లు చెప్పారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రచార కార్యక్రమాలకు ఉపయోగించే లౌడ్ స్పీకర్లు, పోడియం, ఫ్లెక్సీ, క్లాత్ బ్యానర్లు, ఫ్లాగ్స్, పోస్టర్లు, హోర్డింగ్‌లు, కటౌట్లు, వీడియోగ్రఫీ, పెన్‌డ్రైవ్స్, క్యాసెట్లు, స్వాగత తోరణాలు, వాహనాల కిరాయిలు, డ్రైవర్ బత్తాలు, హోటల్ రూమ్స్ కిరాయిలు, ఇతర ప్రచార సామగ్రికి సంబంధించిన రేట్ కార్డు నిర్ణయించినందున ఎన్నికల ఖర్చుకు లోబడి ఖర్చు చేయాలని సూచించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉడుత భాస్కర్, మంగు నరసింహారావు, బీఎస్పీ నాయకుడు బట్టు రామచంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు కూర వెంకటేశం, కొలుపుల గణేశ్, సయ్యద్ ముల్తాన్షా, రవీందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, డిప్యూటీ తాసీల్దార్ సురేశ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

కృష్ణా జలాల పరిరక్షణకు ఉద్యమించాలి

● మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

చౌటుప్పల్ : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్, ఫిబ్రవరి10 : కృష్ణా జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ బహిరంగ సభ సన్నాహక సమావేశంలో భాగంగా శనివారం చౌటుప్పల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మున్సిపల్, మండల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి నందికొండ శ్రీధర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల నీటి హక్కుల కోసం రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణ కేంద్రానికి అప్పగించడంపై ఆయన మండిపడ్డారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పాలని బెదిరింపులకు పాల్పడినా కేసీఆర్ భయపడలేదన్నారు. ప్రభుత్వాన్ని రద్దు చేస్తామని చెప్పినా ఎక్కడా తలొగ్గలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు అధికారం కట్టబెడితె ఇలా చేస్తారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తే తొలుత నల్లగొండ జిల్లాకే ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించకుండా నిలువరించేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వచ్చి సభను విజయవంతం చేయాలన్నారు.

సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, ఢిల్లీ మాధవరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, ముటుకుల్లోజు దయాకరాచారి, బొంగు జంగయ్యగౌడ్, సుర్వి మల్లేశ్ గౌడ్, గుండెబోయిన వెంకటేశ్ యాదవ్, ఊడుగు మల్లేశం గౌడ్, తాడూరి పరమేశ్, బొడిగె బాలకృష్ణగౌడ్, చిన్నం బాలరాజు, ఆల్మాస్ పేట కృష్ణయ్య, తొర్పునూరి నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత



జోజప్ప కటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

అడ్డగూడూరు, ఫిబ్రవరి 10 : మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన గోవిందు జోజప్ప కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్ బాధిత కుటుంబ సభ్యులకు శనివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేశారు.

ఆదర్శ రజక సహకార సంఘం అధ్యక్షుడిగా మురళీకృష్ణ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి10 : మండల కేంద్రంలో ఆదర్శ రజక సహకార కమిటీ సమావేశం శనివారం సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలిమినేటి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎలిమినేటి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా పైళ్ల ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా వెలిమెకన్నె స్వామి, కోశాధికారిగా అంబోజు శ్రీనివాస్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు బుచ్చయ్య, సత్యనారాయణ, నర్సింహ పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవాల దానం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి10 : మండల కేంద్రానికి చెందిన మజ్జిగ బీరయ్య(57) నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. మృతుని కుటుంబ సభ్యుల అంగీకారంతో జీవన్‌దాన్ ఆధ్వర్యంలో అవయవాలను దానం చేశారు.

దేశ వ్యాప్త సమ్మెపై వినతిపత్రం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : ఈ నెల 16న దేశవ్యాప్త మున్సిపల్ కార్మికుల సమ్మెపై అనుమతి కోరుతూ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి మున్సిపల్ యూనియన్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గంధమల్ల మాతయ్య, పీసీకే సంతోశ్, కార్మికులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి10 : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి స్పృహ తప్పి పడిపోగా అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రంగారావు గమనించి 108 సాయంతో భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, ఆచూకి తెలిసిన వారు యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712662806 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోటకొండూర్ మండలంలోని అరెగూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి10 : వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ... చేతిపంపులకు మరమ్మతులు చేయించడంతోపాటు అద్దె బోర్లను లీజుకు తీసుకోవాలని గ్రామ ప్రత్యేకాధికారులకు సూచించారు. మిషన్‌భగీరథ ద్వారా ప్రతి కుటుంబానికి ప్రతిరోజూ 50 నుంచి 60 లీటర్ల నీటిని అందిస్తున్నామని, మున్ముందు ప్రతి ఇంటికీ రోజుకు వంద లీటర్ల నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం చేపట్టిన డాటా ఎంట్రీని పరిశీలించారు. అంతకు ముందు రాయిపల్లి నర్సరీని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ నిరంజన్‌వలి, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, గ్రామ ప్రత్యేకాధికారి సునీల్ ప్రసాద్, కార్యదర్శులు ఉన్నారు.

పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహించాలి

మోటకొండూర్, ఫిబ్రవరి 10 : గ్రామాల్లో పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని అరెగూడెం, గిరిబోయినగూడెం, సికిందర్‌నగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి మొక్కల ఎదుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు స్వాతి, సోఫియా, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల వ్యాప్తంగా పారిశుధ్య వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు మురుగు కాల్వలను శుభ్రం చేయించారు.

బొమ్మలరామారం : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ సరిత సూచించారు. శనివారం మండలంలోని రామస్వామి తండా, మేడిపల్లి, మర్యాల బొమ్మలరామారంలో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి10 : గ్రామపంచాయతీ కార్యదర్శి విధుల్లో అలసత్వం వహిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని పలువురు వార్డు సభ్యులు, మండల కో ఆప్షన్ సభ్యుడు, గ్రామస్తులు శనివారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని మాసాయిపేట పంచాయతీ కార్యదర్శి కవిత సరిగా విధులు నిర్వహించడంలేదని, సమయానికి కార్యాలయానికి రావడం లేదని ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డికి వివరించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిని వేరే గ్రామానికి బదిలీ చేసి నూతన కార్యదర్శిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు యాకూబ్, వార్డు సభ్యులు కళ్లెం విజయ, సుంచు వినోద్ పాల్గొన్నారు.

పోచంపల్లి ఎస్ఐగా భాస్కర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 10 : భూదాన్‌పోచంపల్లి నూతన ఎస్ఐగా కంచర్ల భాస్కర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ రూరల్ నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ విక్రంరెడ్డి ఎల్బీనగర్ సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. అలాగే ఇక్కడ పని చేస్తున్న మరో ఎస్ఐ సురేశ్‌కుమార్ పోచారం ఐటీ కారిడార్‌కు బదిలీ అయ్యారు. ఇతని స్థానంలో మరొకరు రావాల్సి ఉంది.

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్

బీబీనగర్ : పట్టణ పోలీస్టేషన్ నూతన ఎస్ఐగా రమేశ్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్‌కు బదిలీ కాగా యాదగిరిగుట్ట పోలీస్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రమేశ్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి యాదగిరిగుట్టపైకి ఆటోలు

యాదగిరిగుట్ట కొండపైకి వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డులో డివైడర్ కోన్స్ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి10 : యాదగిరిగుట్ట కొండపైకి నేటి నుంచి ఆటోలను అనుమతించనున్నారు. ఆదివారం ఉదయం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పచ్చజెండా ఊపి ఆటోలను ప్రారంభించనున్నారు. ఇందుకు ఏర్పాట్లను ట్రాఫిక్ పోలీసులు, ఆలయ అధికారులు పూర్తి చేశారు. మొదటి ఘాట్‌రోడ్డుపై రంబుల్ స్టెప్స్, కోన్స్ ఏర్పాటు చేశారు. రోజుకు కేవలం 100 ఆటోలను మాత్రమే అనుమతించనున్నారు. కేవలం మొదటి ఘాట్ రోడ్డులో మాత్రమే ఆటోలను నడిపించాలని, ఇతర మార్గాల్లో ఆటోలకు అనుమతి ఇవ్వబోమని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. ఆటోలో కేవలం ముగ్గురికి మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి స్వామివారి వైకుంఠద్వారం గుండా మొదటి ఘాట్‌రోడ్డు గుండా కొండపైకి వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ.20, కొండకింద లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, కొత్త బస్టాండ్ నుంచి గుండిచెరువు గుండా మొదటి ఘాట్ రోడ్డు నుంచి కొండపైకి వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ.25 చార్జి చేయనున్నారు. ఇందుకు సంబంధించి నేడు అధికారికంగా వెల్లడించనున్నారు. భక్తుల నుంచి అధిక డబ్బులు వసూలు చేసి వారిని కొండపైకి నిరాకరిస్తారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు డ్రెస్‌కోడ్ తప్పనిసరి. మద్యం సేవించి ఆటో నడిపితే అనుమతి రద్దు చేస్తారు. ఉదయం 50, సాయంత్రం 50 ఆటోలను మాత్రమే కొండపైకి నడిపించాల్సి ఉంటుంది. 25 ఆటోలు కొండపైన ఉంటే, మరో 25 ఆటోలు కొండ కింద బస్టాండ్ వద్ద ఉండేలా నిబంధనలు ఉన్నాయి. ప్రతి ఆటోకు స్వామివారి చిత్రపటంతోపాటు ఐడీ నంబర్ ఉంటుంది. అయితే కొండపైన మాత్రం స్వాగత తోరణం వరకే అనుమతి ఉండటంతోపాటు అక్కడే ఆటో స్టాండ్ వరకు వెళ్లి తిరిగి క్యూ పద్ధతిలో కొండ దిగాలి. నిబంధనలను తప్పనిసరి చేయడంతో ఆటోకార్మికుల్లో నిరాశే మిగిలింది.

కొబ్బరికాయ కొట్టాకే దర్శనం..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం కొబ్బరికాయ కొట్టాకే ఉండబోతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆలయ అధికారులు వేగవంతం చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయంలోకి ప్రవేశించే తూర్పు రాజగోపురం ముందు భాగంలో స్వర్ణవర్ణపు క్యూలైన్ వద్ద కొబ్బరికాయ కొట్టేందుకు స్థలాన్ని కేటాయించారు. ధర్మదర్శనం, రూ.150 దర్శనానికి వచ్చే భక్తులు క్యూలైన్‌లో తూర్పు రాజగోపురం వద్దకు రాగానే అక్కడే కొబ్బరికాయ కొట్టాల్సి ఉంటుంది.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

● జిల్లా వైద్యాధికారి పరిపూర్ణాచారి

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 10 : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని జిల్లా వైద్యాధికారి పరిపూర్ణాచారి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో సీనియర్ రొటేరియన్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఎంపల్ల బుచ్చిరెడ్డి జన్మదినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వీల్‌చైర్లు అందజేశారు. కార్యక్రమంలో పడమటి జగన్మోహన్‌రెడ్డి, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ చెన్నె లక్ష్మణ్, కోశాధికారి వేమూరి అశోక్‌కుమార్, ఎలక్ట్రిక్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, రవీందర్, గౌలికార్ కిషన్, యాదగిరిగుట్ట రోటరీ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్, దేవేందర్‌చారి, హరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర తనిఖీ

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 10 : పట్టణంలోని 8వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని కౌన్సిలర్ పంగ రెక్క స్వామి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు పౌష్టికాహారం అందుతున్నదా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఇట్టబోయిన సబిత, సుదర్శన్, సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్ సరోజ, ఆయా ధనలక్ష్మి పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ పోస్టర్ విడుదల

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 10 : హిందూవాహిని భువనగిరి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ, శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు శివ గణేశ్, పట్టణాధ్యక్షుడు ఊదరి రామరాజు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 25 ఉదయం 9 గంటలకు స్థానిక హనుమాన్ వాడలోని లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం నుంచి పాదయాత్ర మొదలై పోచమ్మవాడలోని రాములోరి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యుడు ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ బాదం ప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, కౌన్సిలర్లు ఉదయగిరి విజయ్, రత్నపురం బలరాం, పంగ రెక్క స్వామి, హిందూవాహిని కార్యకర్తలు కడారి శివ, ఉడుతల భరత్, కందారి శ్రీధర్, ఉప్పు అనిల్, రత్నపురం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు

రామన్నపేట, ఫిబ్రవరి10 : మండలంలోని కక్కిరేణి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కనకసేన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

● డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఈఓ నారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని జీనియస్ హైస్కూల్ 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి 10వ తరగతితో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు పడాల శ్రీనివాస్, చైర్మన్ తోట శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'చలో నల్లగొండ'ను విజయవంతం చేయాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి,నాయకులు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 10 : ఈ నెల 13న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో నల్లగొండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, మాజీ ఎంపీటీసీ పూలపల్లి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నాగులపల్లి దేవగిరి, నాయకులు గజ్జెల్లి రవి, పోలెపాక అబ్బయ్య, బాలెంల అరవింద్, మాదాసు ఆంటోని పాల్గొన్నారు.

కుష్టుపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు కుష్టుపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వలిగొండ, ఫిబ్రవరి 10 : మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాల విద్యార్థులకు కుష్టువ్యాధిపై శనివారం డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శరీరంపై ఎరుపు, తెలుపు మచ్చలు ఏర్పడి స్పర్శ, నొప్పిలేకుండా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడితే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాము, దుర్గ, వైద్య సిబ్బంది శోభారాణి, సత్తయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు : ఎస్ఐ

వలిగొండ : ట్రాఫిక్ సమస్యలపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహేందర్‌లాల్

వలిగొండ, ఫిబ్రవరి 10 : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని స్థానిక ఎస్ఐ మహేందర్‌లాల్ పుట్‌పాత్, తోపుడుబండ్ల వ్యాపారస్తులు, వాహనదారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఆటో డ్రైవర్లు, వీధి వ్యాపారస్తులు తమ బండ్లను వెనక్కి జరపుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడుపొద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి10 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నేటి నుంచి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామానుజాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న వృక్షశాస్త్రం, 12న జంతుశాస్త్రం, 13న భౌతికశాస్త్రం, 14న రసాయన శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 16న మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ నిర్వహిస్తామని తెలిపారు. 17న పూర్వ విద్యార్థులకు నీతి శాస్త్రం, 19న మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ శాస్త్రం పరీక్ష ఉంటుందని వివరించారు.

కిడ్నాపైన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

కిడ్నాప్‌కు గురైన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పట్టణ పోలీసులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : జిల్లా కేంద్రంలో ఈ నెల 5న కిడ్నాప్‌కు గురైన బాలుడిని భువనగిరి పట్టణ పోలీసులు శనివారం బాలుడి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లాకు చెందిన రాజు ఈ నెల 4న కూలి పని కోసం కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరికి వచ్చాడు. 5న భువనగిరిలోని బస్టాండ్ సమీపంలో నిద్రిస్తుండగా ఉదయం ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి కలిసి బాలుడు సిద్ధిరాములును కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత నిద్ర లేచిన బాలుడి తండ్రి రాజు సిద్ధిరాములు కోసం ఎంత వెతికినా కనిపించ